శుక్రవారం
3 ఏప్రిల్ 2026
సంపుటి: 18 సంచిక:78
పేజీలు : 04, వెల రూ. 2రూ/
ఎడిటర్ : మజ్జి శివ కుమార్..

Published by:Vizianagaram, Visakhapatnam, Srikakulam, Parvathipuram manyam, Anakapalli, Kurnool, Alluri, Guntur, Vijayawada, East & West Godavari, Tirupathi, Hyderabad

www.prajaswamyamtelugudaily.com

స్థాపితం : 2008

# ప్రజాస్వామ్యం


తెలుగు దినపత్రిక

PRAJASWAMYAM TELUGU DAILY (ANDHRA & TELANGANA)

RNI No. APTEL/2008/24928Postal Registration No.: VZM/22/2020-2022 Period of Renewal

## 53 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర

'ఆర్టెమిస్ -2' యాత్ర ప్రారంభం
విజయవంతమైతే నేరుగా చంద్రుడిపైకి
అంతరిక్ష పరిశోధనల్లో మరో చారిత్రక ఘట్టం



2 లో

## తెలుగు జాతి

# గౌరవం అమరావతి



ప్రపంచంలో ఉత్తమ రాజధానిగా తీర్చిదిద్దుతాం

బిల్లు ఆమోదం తరువాత సంబరాల్లో పాల్గొన్న సీఎం చంద్రబాబు

శంకుస్థాపన చేసిన ప్రదేశంలో పూజలు, సాష్టాంగ ప్రణామం

గుంటూరు : తెలుగు జాతి గుండె, జాతి గౌరవం అమరావతి అని, ఆంధ్రుల ఏకైక ప్రజా రాజధాని అమరావతే అని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచంలో ఉత్తమ రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతామన్నారు. అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటు ఉభయ సభల్లో బిల్లుకు ఆమోదం పొందిన తరువాత గురువారం రాత్రి రాజధాని గ్రామాల్లో రైతులు సంబరాలు చేసుకున్నారు. ఈ సంబరాలకు సిఎం చంద్రబాబుతో సహా ఆయన సతీమణి భువనేశ్వరి, మంత్రులు పి.నారాయణ, అచ్చెన్నాయుడు, నాదెండ్ల మనోహర్, అధికారులు, రాజధాని రైతులు పాల్గొన్నారు. రాజధానికి శంకుస్థాపన చేసిన ఉద్దండరాయుని పాలెం వద్ద రైతులతో కలిసి దీపహారతి కార్యక్రమంలో సిఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అమరావతిలో ప్రపంచ స్థాయి నగరాన్ని నిర్మిస్తామని, రాష్ట్రంలో ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని, అమరావతి సాక్షిగా ప్రజలకు హామీ ఇస్తున్నానని ప్రకటించారు. తిరుపతి, విశాఖపట్నం నగరాలను కూడా అమరావతితో సమానంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. అమరావతి రాజధానిగా చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంటులో తిరుగులేని శాసనం చేశామని, ఇది ప్రజా సంకల్పానికి దక్కిన గౌరమని తెలిపారు. అనేక కుట్రలను ఎదుర్కొని రాజధానిని దక్కించుకున్నామని, రాజధానిని స్మశానం అన్న వారు నేడు అడ్రస్ లేకుండా పోయారని వైసిపినుద్దేశించి ఎద్దేవా చేశారు. రాజధానికి చట్టబద్ధత కల్పించడం ద్వారా శాశ్వత అడ్రస్ వచ్చిందన్నారు. రైతులు, రైతు కూలీలు, ప్రజల ఐక్యమత్యం వల్లే ఈ విజయం సాధించుకున్నామన్నారు. ఓ ప్రాజెక్టుకు రెండుసార్లు ప్రధాని రావడం అమరావతి పనుల విషయంలోనే జరిగిందన్నారు. అమరావతి నిర్మాణాలు పూర్తి అయ్యాక మరోమారు ప్రారంభోత్సవాలకు ప్రధాని వస్తారని తెలిపారు. 'ఒక్క వైసిపి మినహా దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు అమరావతికి అండగా నిలబడ్డాయి. ప్రజలు శాశ్వతంగా వైసిపిని మర్చిపోవాలి. రాజధానితో మూడు ముక్కలాట ఆడి అడ్రస్ లేకుండా పోయారు. అమరావతికి చట్టబద్ధత కల్పించే అంశంపై తీర్మానం పెడితే ఆ పార్టీ అసెంబ్లీకి కూడా హాజరు కాలేదు. పార్లమెంటులో చట్టం చేస్తుంటే వాకౌట్ చేసింది. వాకౌట్ చేసిన ఆ పార్టీని ప్రజలు బ్లాక్ అవుట్ చేయాలి. మావిగన్ అంటూ జగన్ ఓ కొత్త ప్రతిపాదన చేశారు. డిక్షనరీలో వెతికినా నాకు అర్థం దొరకలేదు. జగన్‌వి అన్నీ బుద్ధి లేని వ్యాఖ్యలు, దుర్మార్గపు ఆలోచనలే' అని సిఎం చంద్రబాబు మండిపడ్డారు. శంకుస్థాపన స్థలంలో దీప హారతికూటమి నేతలతో కలిసి శంకుస్థాపన శిలాఫలకాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిశీలించారు. ఆ వేదిక వద్ద వేద పండితుల ఆశీర్వచనాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ సాష్టాంగ ప్రణామం చేశారు. అనంతరం దీప హారతి ఇచ్చారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, భాష్యం ప్రవీణ్, అమరావతి రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం

### ఎల్‌డీఎఫ్ మ్యానిఫెస్టోను విడుదల చేసిన కేరళం సీఎం పినరయి

### యూడీఎఫ్ మ్యానిఫెస్టో విడుదలలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

తిరువనంతపురం, ఏప్రిల్ 2: కేరళ అసెం బ్లీ ఎన్నికల్లో తమ కూటమి విజయం సాధి స్తే.. ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం కేటాయిస్తామని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్డీ ఎఫ్) పార్టీ ప్రకటించింది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ తమ పార్టీ మ్యానిఫెస్టోను గురువారం విడుదల చేశారు. విస్తృత సంక్షే మం, అభివృద్ధి, మహిళాసాధికారత లక్ష్యం గా 60 పాయింట్లతో రెండు వాల్యూమ్‌లు గా దీన్ని రూపొందించారమరోపక్క కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ మ్యానిఫెస్టో విడుదలలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొ న్నారు. 140 స్థానాలు ఉన్న కేరళలో ఏప్రిల్ 9న ఎన్నికలు జరగనున్నాయి. ఎల్‌డీఎఫ్ మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలు ఈ కింది విధంగా ఉన్నాయి. నెలవారీ పింఛన్ రూ.3 వేలకు పెంపు, అత్యంత పేదరికంలో ఉన్న ఐదు లక్షల కుటుంబాలను ఆదుకోవడం, బలహీన వర్గాలపై ప్రత్యేక దృష్టి, వృద్ధులకు, మంచానపడిన రోగులకు మెరుగైన సంరక్షణ ఇవ్వడం,చదువు పూర్తి చేసుకున్న విద్యా ర్థులకు క్యాంపస్ ప్లేస్మెంట్లు కల్పించడం, నైపుణ్య శిక్షణ ప్రోగ్రామ్లు విస్తరించడం, 'బ్యాక్ టు క్యాంపస్' పేరుతో ఉద్యోగం లేని వారికి నైపుణ్యాలు అందించడం, 50 శాతం ఉద్యోగాలు మహిళలకు కేటాయింపు, మహిళలు ఉద్యోగాలు చేసుకునేందుకు వీలుగా సురక్షిత ప్రయాణం, శిశు సంరక్షణ, నైపుణ్యాల్లో శిక్షణ ఇప్పించడం, విద్యావంతులైన వారు చేపట్టే వ్యాపారాలకు వడ్డీలేని

వివరాలు2లో..

## పెట్రో కెమికల్స్‌పై ఊరట

### దిగుమతులపై ఎక్సైజ్ డ్యూటీని తగ్గించిన కేంద్రం-ఏడాది పాటు అమలు




2 లో

# అమరావతికి రాజ్యసభలోనూ ఆమోదం

న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు రాజ్యసభలోనూ ఆమోదం లభించింది. దీంతో ఈ బిల్లుకు పార్లమెంట్ ఉభయ సభల ఆమోదముద్ర ప్రక్రియ ముగిసింది. అనంతరం ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రపతికి పంపనుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేసిన తరువాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. గురువారం రాజ్యసభలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద రారు బిల్లును ప్రవేశపెట్టనున్నారు. అనంతరం రాజ్యసభ ఛైర్మన్ సిపి రాధాకృష్ణన్ ఈ బిల్లుపై చర్చకు అనుమతి ఇచ్చారు. ఈ చర్చలో 11 పార్టీలు నుంచి 18 మంది సభ్యులు పాల్గొన్నారు. అయితే వైసిపి రాజ్యసభలో కూడా బిల్లును వ్యతిరేకించి సభ నుంచి వాకౌట్ చేసింది

రెండు రాష్ట్రాలతో కేంద్రం ఆటలు : రేణుకా చౌదరి

కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి చర్చను ప్రారంభిస్తూ రాజధాని బిల్లు రైతుల విజయమని అన్నారు. ఉద్యమ సమయంలో రైతులను, మహిళలను తీవ్రంగా హింసించారని, ఎంత మంది వేధించినా రైతులు తమ

వివరాలు2లో..





### దుస్సాహసానికి పాల్పడితే

## తీవ్ర పరిణామాలు

### ఇరాన్ యుద్ధాన్ని ఆసరాగా చేసుకోవద్దు

### పాకిస్థాన్‌ను హెచ్చరించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్



2 లో

# పరి-శోధనలను ప్రోత్సహించాలి

### జెఎన్‌టియుకె స్నాతకోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ - శాంత బయోటెక్ చైర్మన్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం



కాకినాడ , : విశ్వవిద్యాలయాలు పరిశోధనలను ప్రోత్సహించాలని రాష్ట్ర గవర్నర్, జెఎన్‌టియుకె కులపతి ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కాకినాడ జెఎన్‌టియుకె ప్రాంగణంలోని అలూమినీ ఆడిటోరియంలో జెఎన్‌టియుకె 12వ స్నాతకోత్సవం గురువారం జరిగింది. దీనికి గవర్నర్ హాజరయ్యారు. తొలుత ముఖ్యఅతిథిగా హాజరైన శాంత బయోటెక్ ప్రయివేట్ లిమిటెడ్ చైర్మన్, డాక్టర్ కెఐ.వరప్రసాద్‌రెడ్డికి గౌరవ డాక్టరేట్‌ను గవర్నర్ అందించారు. అనంతరం డిజి లాకర్ నేషనల్ అకాడమిక్ డిపాజిటరీ (ఎన్ఎడి) పోర్టల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి గవర్నర్ ప్రసంగించారు. విద్యార్థులు సాధించిన విజయాలు వారి కృషి, పట్టుదల, నిరంతర సాధనకు ప్రతీక అని అన్నారు. ప్రస్తుత ప్రపంచం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్వాంటమ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, రోబోటిక్స్, ఐఒటి వంటి ఆధునిక సాంకేతిక రంగాల వైపు వేగంగా పయనిస్తోందన్నారు. ఆ దిశగా విద్యార్థులు కూడా ఎప్పటికప్పుడు అప్‌డేట్ కావాలన్నారు. జెఎన్‌టియుకెలో ఇంటర్న్‌షిప్స్, ఫీల్డ్ విజిట్స్, కమ్యూనిటీ సేవా కార్యక్రమాల ద్వారా సమగ్ర అభ్యాసనానికి ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు. జర్మనీ, అమెరికా, ఆస్ట్రేలియా దేశాల్లోని విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యాల

వివరాలు2లో..

### జ్యుడీషియల్ అధికారుల

# నిర్బంధంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ..ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) విధుల్లో ఉన్న జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన ఘటనపై సుప్రీంకోర్టు గురువారం నాడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సిబిఐ) లేదా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ)తో దర్యాప్తు చేపట్టాలని ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేసింది. బెంగాల్‌లో ప్రతి ఒక్కరూ రాజకీయ భాషే మాటా డుతున్నారని విచారణ సందర్భంగా భారత ప్రధానన్యాయమూర్తి (సిజెఐ) జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తం చేశారు. 'తప్పు ఎవరు చేస్తున్నారో మాకు తెలియదనుకుంటున్నారా? ఈ ఘటనను తెల్లవారుజామున 2 గంటల వరకు పర్యవేక్షిస్తూనే ఉన్నా. ఇది చాలా దురదష్టకరం' అని ఆయన అన్నారు. ఈ ఘటనపై పలువురు రాష్ట్ర అధికారులకు న్యాయస్థానం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. జ్యుడీషియల్ అధికారుల భద్రత కల్పించడంతో పాటు 'సర్' ప్రక్రియకు ఆటంకం కలగకుండా ఉండేందుకు కేంద్ర



బలగాలను మోహరించాలని ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. అసలేం జరిగిందంటే..ఎస్ఐఆర్ పేరుతో పెద్దఎత్తున ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే మాల్దా జిల్లాలో బుధవారం ఆందోళనలు జరిగాయి. ఇక్కడ సర్

వివరాలు2లో..

## పెట్రో కెమికల్స్‌పై ఊరట

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం దేశ పై పడకుండా ఉండేందుకు మోదీ ప్రభుత్వం చర్యలు ముమ్మరం చేస్తోంది. తాజాగా కొన్ని కీలక పెట్రో కెమికల్ ఉత్పత్తులకు దిగుమతి సుంకాన్ని మినహాయించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ గురువారం ప్రకటన విడుదల చేసింది. దేశీయ పరిశ్రమకు కీలకమైన పెట్రో కెమికల్ ముడిసరకుల లభ్యతకు ఆటంకం కలగకుండా చూడటం, దీనిపై ఆధారపడిన రంగాలపై వ్యయ ఒత్తిళ్లను తగ్గించడం, దేశంలో సరఫరా స్థిరత్వా న్ని కాపాడటం కోసం ఈ చర్యలు చేపట్టామని పేర్కొంది.అయితే, ఈ కస్టమ్స్ డ్యూటీ మినహాయింపు తాత్కాలికమేనని, దీనివల్ల తుది ఉత్పత్తులను కొనుగోలు చేసే వినియోగదారులపైనా అదనపు భారం పడకుండా ఉపశమనం లభిస్తుందని ఆర్థిక మంత్రిత్వశాఖ వెల్లడించింది. ప్రస్తుతం 20 శాతం కస్టమ్స్ సుంకం విభాగంలో ఉన్న ఉ త్పత్తులపై సుంకాన్ని 12.5శాతానికి, 20- శాతం విభాగంలోని వాటిపై కస్టమ్స్ సుంకా న్ని 15శాతానికి, 30 శాతం విభాగంలోని వాటిపై 20శాతానికి తగ్గించింది. 20 26 ఏప్రిల్1 నుంచి 2027 మార్చి 31 దాకా ఇది అమలులో ఉండనుంది.

## 53 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెర

న్యూయార్క్ : అంతరిక్ష పరిశోధనల్లో మరో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. 53 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ మానవుడు మళ్లీ చంద్రుడి వద్దకు పయనమయ్యాడు. అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రమండల యాత్ర 'ఆర్టెమిస్-2' దిగ్విజయంగా ప్రారంభమైంది. గురువారం తెల్లవారుజామున 4.06 నిమిషాలకు ఈ ప్రయోగం మొదలైంది. ఈ ప్రాజెక్టులో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి సమీపానికి వెళ్లి పరిశోధనలు చేయనున్నారు. నలుగురు వ్యోమగాముల బందం చంద్రుని చుట్టూ పది రోజుల పాటు ప్రయాణించి, అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డులను సష్టించబోతోందివిజయవంతమైతే .. నేరుగా చంద్రుడి పైకఆర్టెమిస్-2 అనేది ఒక ప్రయోగం మాత్రమే కాదు. చంద్రునిపై శాశ్వత మానవ ఉనికిని ఏర్పాటు చేసే 'ఆర్టెమిస్ ప్రోగ్రామ్'లో అత్యంత కీలకమైనది. చంద్రుని ఉపరితలంపై మనుషులను దించడానికి ముందు చేసే కీలక పరీక్షలాంటిది. వాస్తవానికి ఈ ప్రయోగం ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్ సెంటర్ నుంచి షెడ్యూల్ ప్రకారం సాయంత్రం 6:24 గంటలకు జరగాల్సి ఉంది. అయితే కొన్ని సాంకేతిక సమస్యలు తలెత్తడంతో నాసా సాంకేతిక బందాలు సత్వరమే స్పందించి సమస్యను పరిష్కరించడంతో ప్రయోగం సజావుగా సాగిందిఈ పది రోజుల యాత్రలో వ్యోమగాములు కీలక పరిశోధనలను చేయనున్నారు. భూమి నుంచి సుమారు 4 లక్షల కిలోమీటర్ల అవతలికి వీరు వెళ్లే అవకాశం ఉంది. వ్యోమగాముల ప్రాణాలను రక్షించే లైఫ్ సపోర్ట్ సిస్టమ్స్, కమ్యూనికేషన్, నావిగేషన్ వ్యవస్థలు చంద్రుని వద్ద ఎలా పనిచేస్తాయో వీరు పరిశీలించనున్నారు. ఈ మిషన్ విజయవంతమైతే, 'ఆర్టెమిస్ -3' ద్వారా చంద్రునిపై మనుషులను నేరుగా దించే ప్రక్రియ మరింత సులభతరం కానుంది. 1972లో అపోలో-17 తర్వాత, మళ్లీ ఇప్పుడు మానవ మేధస్సు చంద్రుడిని తాకేందుకు సిద్ధమైంది. భవిష్యత్ పరిశోధనలు, ప్రయోగాలలకు ఇది కీలకం కానున్నది

## టి. నగరపాలెం సర్పంచ్ కు ఘన సత్కారం



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం పదవీ కాలం ముగిసిన టి. నగర పాలెం గ్రామ సర్పంచ్ గ్రామ పెద్దలు ఘనంగా సత్కరించారు. స్వర్ణ గ్రామ కార్యాలయం లో సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు అందరూ వచ్చి సర్పంచ్ దంపతులను, వార్డు సభ్యులు ను శాలువాతో సన్మానం చేసి, మెమెంటో లు తో సత్కరించారు. ఈ సందర్భంగా పంచాయతీ బోర్డు మెంబర్ పూసర్ల రామారావు యాదవ్ మాట్లాడుతూ సర్పంచ్, సెక్రటరీ లు వార్డు సమస్యలపై వెంటనే స్పందించి సమస్య లు పరిష్కారానికి కృషి చేసేవారని చెప్పారు. పంచాయితీ పనులు పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి సుమారు ఆరు కోట్లు రూపాయలుతో అభివృద్ధి పనులు చేశారన్నారు. అభివృద్ధి పనులు విషయం లో మరియు ఉత్తమ పరిపాలనా భాగం గా మొదటి స్థానం టి. నగర పాలెం పంచాయతీకి మూడు అవార్డులు కేంద్ర ప్రభుత్వం నుంచి, రాష్ట్ర ప్రభుత్వం నుంచి, జిల్లా అధికారులు నుంచి ఉత్తమ పరిష్కారాలు లభించాయన్నారు. అభివృద్ధి పదంలో నడిపించిన సర్పంచ్ పోట్లూరు ఛాయగౌతమి, చంద్రశేఖర్, వార్డు సభ్యులకు ప్రత్యేక ధన్యవాదములు తెలియచేసారు. ఈ కార్యక్రమం లో ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి పోతిన వెంకట అప్పారావు, ఎంపీటీసీ పల్ల నీలిమ సన్యాసి రావు, మండల పరిషత్ అధ్యక్షులు వాసు రాజు, వార్డు సభ్యులు సచివాలయం సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఉద్యోగాల్లో మహిళలకు 50 శాతం

మొదటి పేజి తరువాయి

రుణా లు అందించడం తదితర హామీలను గుప్పించారు.మరోవైపు ప్రతిపక్ష కాంగ్రెస్ నేతృ త్వంలోని యూడీఎఫ్ కూడా ఎన్నికల మ్యా నిఫెస్టోను విడుదలచేసింది. మహిళలకు ఉచి త బస్సు ప్రయాణాలు, సంక్షేమ పింఛను రూ.3,000కు పెంపు, కళాశాల విద్యార్థినులకు రూ.1,000 వంటివి ఉన్నాయి. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల బీమా కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## పరిశోధనలను ప్రోత్సహించాలి

మొదటి పేజి తరువాయి

ద్వారా గ్లోబల్ అవగాహన పెంపొందుతుందన్నారు. ఎన్ఇపి ద్వారా దేశ విద్యా రంగంలో కీలక మార్పులు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. అమరావతి క్వాంటమ్ వ్యాలీ వంటి ప్రాజెక్టులు రాష్ట్రాన్ని ఆధునిక సాంకేతిక పరిశోధనల కేంద్రంగా తీర్చిదిద్దుతాయన్నారు. అనంతరం కెఐ.వరప్రాద్ మాట్లాడుతూ.. సొంత విద్యాసంస్థలో గౌరవ డాక్టరేట్ అందుకోవడం గొప్ప అనుభూతిని ఇచ్చిందన్నారు. విద్యాసంస్థలు పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను బోధించాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ సంఘటనలు, కోవిడ్ మహమ్మారి వంటి సందర్భాలు పరిశోధన, సిద్ధత ఎంత ముఖ్యమో చూపించాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విసి సిఎస్ఆర్ కె.ప్రసాద్, రెక్టార్ పి.సుబ్బారావు, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు, ఒఎస్‌డి కోటేశ్వరరావు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతికి రాజ్యసభలోనూ ఆమోదం

మొదటి పేజి తరువాయి

నిరసనలు ఆపలేదన్నారు. ఏపి రాజధానిపై 12 ఏళ్లుగా అస్ప ష్టత ఉందన్నారు. అస్పష్టత వల్లే పెట్టుబడులు కూడా వెనక్కి వెళ్లాయని తెలిపారు. దుగరాజ పట్నం, కడప స్టీల్ ప్లాంట్‌ను ముగిసిన అధ్యాయం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'బిల్లు పెట్టడం కాదు.. టైంకు రాజధాని పూర్తి చేసి చూపించాలి. జగన్ మూడు రాజధానుల పేరుతో రాజధాని లేకుండా చేశారు. రెండు రాష్ట్రాలతో కేంద్రం ఆటలు ఆడు తోంది. రూ. 1.47 లక్షల కోట్ల విలువైన ఆస్తుల పంపకాలు జరగలేదు. తెలంగాణకు ఇచ్చిన హామీలు కూడా కేంద్రం నెరవేర్చలేదు. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఎన్‌టిపిసి కూడా కేంద్రం ఇవ్వలేదు. ఇప్పటివరకు హామీలు ఎందుకు నెరవేర్చలేదో కేంద్రం చెప్పాలి. హామీలు అమలు చేయనందుకు రెండు రాష్ట్రాలకు పరిహారం ఇవ్వాలి' అని అన్నారు. '12 ఏళ్ల తరువాత కూడా ఆస్తుల పంపకం ఇంకా పూర్తి కాలేదు. ఐదు గ్రామాలు ఏ రాష్ట్రానికి చెందకుండా పోయాయి. భౌగోళికంగా ఏపిలో ఉన్నా.. ఆ గ్రామాలు ఇంకా ఇబ్బంది పడుతున్నాయి. తెలంగాణలో ఉండాలని కోరకుంటున్న వాళ్లను ఆంధ్రాలో కలిపారు. రెండు తెలుగు రాష్ట్రాలు కలిసే ముందుకు సాగక తప్పదు' అని ఆమె అన్నారు.

## సుస్థిర ఆర్థికాభివృద్ధి దిశగా అధికారులు పనిచేయాలి

**డిఆర్డిఏ సమీక్షలో జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టీకరణ**
**గ్రామీణ ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడాలి**
**జీవనోపాధి అవకాశాలపై వర్క్‌షాప్ నిర్వహించాలి**




ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఏప్రిల్ 2 : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగుపరచడానికి, సుస్థిర ఆర్థికాభివృద్ధి దిశగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు.ఇందుకు సంబంధించి కేవలం అంచనాలతో కాకుండా, క్షేత్రస్థాయి విశ్లేషణ అవసరమని కలెక్టర్ తెలిపారు. ఈ ఏడాది కొత్తగా 10వేల మంది మహిళలను సంఘ సభ్యులుగా చేర్పించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. పొదుపు మొత్తాన్ని అధిక వడ్డీని అందించే బ్యాంకుల్లో జమచేయాలని సూచించారు. రుణ పరిమితిని పెంచి, వారి జీవనప్రమాణాలు పెరిగేలా చూడాలని దిశానిర్దేశం చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డీఆర్డీఏ - వెలుగు అధికారులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది కాలంలో సాధించిన లక్ష్యాలు, ఎదురైన సవాళ్లు, క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను విశ్లేషించి, తదుపరి కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఫిబ్రవరి నాటికే లక్ష్యాలను పూర్తి చేసేలా స్పష్టమైన ప్రణాళికలతో ముందుకు వెళ్లాలని అన్నారు.రాబోయే కాలానికి నిర్దేశించుకున్న లక్ష్యాలను శాస్త్రీయంగా రూపొందించాలని, కనీసం 30 శాతం అదనపు వృద్ధిని సాధించే దిశగా ప్రణాళికలు ఉండాలని ఆదేశించారు. అలాగే గత ఏడాది వృద్ధి సాధించిన సంఘాలను గుర్తించి, వారి విజయగాథలను రూపొందించాలని తెలిపారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని, అక్కడ ఉన్న వ్యాపార అవకాశాలు, ప్రజల నైపుణ్యాలు మరియు ప్రస్తుతం జరుగుతున్న వ్యాపారాలపై సమగ్ర విశ్లేషణ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రత్యేకంగా జీవనోపాధి అవకాశాలపై అధికారులకు, కన్సల్టెంట్లకు అవగాహన కల్పించేందుకు వర్క్‌షాప్‌లు నిర్వహించాలని ఆదేశించారు. పారిశ్రామిక వేత్తల తయారీలో భాగంగా మండలాల్లో ఉండే అవకాశాలు, లభ్యమయ్యే పంటల ఆధారంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. రుణాల మంజూరు, ఉపాధి కల్పనలో కేవలం మహిళలకే కాకుండా, పురుషులకు కూడా అవకాశాలు కల్పిస్తూ సమగ్రమైన డేటాను సిద్ధం చేయాలని సూచించారు. ప్రత్యక్ష మరియు పరోక్షంగా పారిశ్రామికవేత్తల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో చేసిన విశ్లేషణ ఆధారంగా ప్రతి మండలం నుండి స్పష్టమైన వివరాలతో పాటు తదుపరి కార్యాచరణ ప్రణాళికను త్వరితగతిన సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభ్యున్నతి కోసం ఉద్దేశించిన 'ఉన్నతి' పథకం అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. లబ్ధిదారులకు తగిన ఆర్థిక తోడ్పాటును అందిస్తూ ఇచ్చిన లక్ష్యాలను అధిగమించాలని తెలిపారు. అలాగే బకాయి ఉన్న రుణాల రికవరీల్లో భామిని, కురుపాం మండలాల్లో 4% మాత్రమే ప్రగతిని సాధించడం పట్ల కలెక్టర్ ఆరా తీశారు. రికవరీ తక్కువగా ఉన్న మండలాలపై ఏపీఎంలు వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో ఎందుకు రికవరీ కావడం లేదో విశ్లేషించాలని ఆదేశించారు. సంఘ సభ్యులను కలిసి, వారికి ఉన్న సమస్యలను తెలుసుకుని, రికవరీ అయ్యేలా చూడాలని సూచించారు. ప్రతి నెలా వంద శాతం రికవరీ సాధించాలని, ఏప్రిల్ 2వ తేదీ నుండి 15వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఉన్నతి రుణాల బకాయిలు వసూలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ఐటీడీఏ ఏపీఓ పి. మురళీధర్, డిఆర్డీఏ ఏపీడీ జయశ్రీ, డీపీఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

### ఆదర్శవంతమైన

## సేవలకు అపురూప వీడ్కోలు

**తాళ్లవలస ఉప సర్పంచ్ కి అంబేద్కర్ కోలనీ యువత ఘన సన్మానం...**



ప్రజాస్వామ్యం భీమిలి మండలం తాళ్ళవలస పంచాయతీ ఉప సర్పంచ్ పదవి విరమణ కి గురువారం చివరి రోజు కావడంతో తాళ్లవలస అంబేద్కర్ సంఘం యువత ఆద్వర్యంలో ఉప సర్పంచ్ బుద్ధరాజు. సత్యనారాయణ రాజు (సింగపూర్ బుజ్జి ) కి ఘనమైన వీడ్కోలు పలుకుతూ అభినందన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప సర్పంచ్ గా (పంచాయతీ సీనియర్ నాయకులు) గా గత ఐదేళ్లుగా సంక్షేమం , అభివృద్ధి ని రెండు కళ్ళు గా చేసుకొని నిరంతరాయంగా పంచాయతీ కి సేవలందించి,అభివృద్ధి పథంలో ముందుకు నడపటంలో అహర్నిశలు కృషి చేసిన ఆయన్ని గజమాల తో, దుస్సాలువా తో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగాఅంబేద్కర్ సంఘం యువత మాట్లాడు"గ్రామ అభివృద్దే ధ్యేయంగా, రాజకీయాలకు అతీతంగా పంచాయతీ ఉప సర్పంచ్ గా సింగపూర్ బుజ్జి రాజు చేసిన సేవలు మరువలేనివి అని మౌలిక సదుపాయాల కల్పనలో, ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయడంలో వారు చూపిన చొరవ అభినందనీయం" అని కొనియాడారు.అనంతరం ఉప సర్పంచ్ సింగపూర్ బుజ్జి రాజు మాట్లాడుతూ.. "గ్రామ ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడం కోసం శక్తివంచన లేకుండా కృషి చేశానని నా పదవి కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా వార్డు సభ్యులకు, గ్రామ సచివాలయ సిబ్బందికి మరియు గ్రామ పెద్దలకు, అంబెద్కర్ కోలనీ వాసులు కు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు పదవిలో ఉన్నా లేకపోయినా గ్రామ శ్రేయస్సు కోసం నా వంతు తోడ్పాటు ఎప్పుడూ ఉంటుంది" అని భావోద్వేగంగా మాట్లాడారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, అసిస్టెంట్ రాము,తేదేపా మహిళా నాయకురాలు ఉప్పాడ లక్ష్మి,సీనియర్ నాయకులు మామిడి బాస్కరరావు,మట్ట ఆదినారాయణ,బోని ప్రసాద్,బోని రాంబాబు,తాటిపూడి గిరీష్,బోని వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యుడీషియల్ అధికారుల నిర్బంధంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

మొదటి పేజి తరువాయి

విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను సాయంత్రం 4 గంటల ప్రాంతంలో ఆందోళనకారులు నిర్బంధించారు. సమాచారం అందుకున్న భద్రతా సిబ్బంది అర్ధరాత్రి ఒంటి గంట తర్వాత అక్కడికి చేరుకొని అధికారులను రక్షించారు. అడ్డుకున్న ఆందోళనకారులపై పోలీసులు లాఠీఛార్జ్ చేయడంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. నిర్బంధానికి గురైన వారిలో ముగ్గురు మహిళా అధికారులు కూడా ఉన్నారు. ఇదే అంశంపై ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పందిస్తూ ఈ విషయంలో తాను చేసేదేమీ లేదని తెలిపారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దిశానిర్దేశంలో కీలుబొమ్మగా నడుస్తున్న ఎన్నికల సంఘమే ప్రస్తుతం రాష్ట్రంలో పాలనా వ్యవహారాలు చూస్తోందని, ఈ ఘటనలకు ఇసిదే బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.

## అమరావతి రాజధానిగా బిల్లు ఆమోదం పొందటం - ఉత్తరాంధ్ర ప్రజల నైతిక విజయం

**: ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు**



విజయనగరం: (ప్రజాస్వామ్యం) అమరావతి రాజధానిగా ఉండాలని ఉత్తరాంధ్ర ప్రజలు మొదటి నుంచీ ఆకాంక్షించారు. గతంలో జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిని గెలిపించడం ద్వారా, అమరావతే మా రాజధాని అని మేధావులు తీర్పునిచ్చారు. అదే స్ఫూర్తితో సార్వత్రిక ఎన్నికల్లోనూ కూటమికి బ్రహ్మరథం పట్టి, రాష్ట్ర భవిష్యత్తు కోసం నిలబడ్డారు" అని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు గుర్తు చేశారు భోగాపురం మరియు పరిశ్రమలకేవలం రాజధానిపైనే కాకుండా, ఉత్తరాంధ్ర అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన పేర్కొన్నారు.ఉత్తరాంధ్ర ముఖచిత్రాన్ని మార్చబోయే భోగాపురం ఎయిర్‌పోర్ట్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, జూన్ 2026 కల్లా ఇది అందుబాటులోకి రానుందని తెలిపారు. ఇది ఈ ప్రాంత రవాణా, పర్యాటక రంగాలకు వెన్నెముకగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. అనకాపల్లి జిల్లాలో ఆర్సెలార్ మిట్టల్-నిప్పన్ స్టీల్ వంటి భారీ పరిశ్రమలు సుమారు రూ. 1.5 లక్షల కోట్ల పెట్టుబడితో రావడం ఉత్తరాంధ్ర యువతకు వరం. సుమారు లక్ష మందికి పైగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఆయన పేర్కొన్నారు విశాఖను ఐటీ హబ్‌గా మారుస్తూ గూగుల్, టీసీఎస్ వంటి సంస్థల రాకతో ఈ ప్రాంతం ఆర్థికంగా బలోపేతం అవుతుందని వివరించారు రాష్ట్ర అభివృద్ధికి అండగా నిలుస్తున్న గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికిఅమరావతి సృష్టికర్త, ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికికూటమి విజయంలో కీలక పాత్ర పోషించిన ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారికఅభివృద్ధి బాటలో అహర్నిశలు శ్రమిస్తున్న యువనేత శ్రీ నారా లోకేష్ గారికి కలిశెట్టి అప్పలనాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారురాజ్యసభ లో అమరావతి బిల్లు ప్రవేశ పెడుతున్న సందర్భంగా నారా లోకేష్ గారు ప్రధాన మంత్రి గారిని, ఇతర కేంద్ర మంత్రులను కలుస్తున్న సందర్భంలో వారు అంతా లోకేష్ గారి కృషికి అభినందనలు తెలియజేసారని అన్నారు అమరావతి రాజధాని బిల్లు అంశం పై పార్లమెంట్ లో మాట్లాడే అవకాశం ఇచ్చిన ఉత్తరాంధ్ర ప్రజలకు ఉత్తరాంధ్ర బిడ్డగా కృతజ్ఞతలు తెలుపుతున్న అన్నారు.అమరావతి అనేది కేవలం ఒక ప్రాంతం కాదు, అది ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం. ఈ రోజు రాజధాని బిల్లు ఆమోదం పొందడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రజల నమ్మకం గెలిచింది. ఒకే రాష్ట్రం - ఒకే రాజధాని అనే నినాదంతో అభివృద్ధి వికేంద్రీకరణ దిశగా మేము ముందుకు సాగుతాం." అని పేర్కొన్నారు.




### గ్రామ స్వరాజ్య సారథులకు

## వీడ్కోలు అభినందనలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్



భీమునిపట్నం, ప్రజాస్వామ్యం అంచెలంచెల అడ్డంకులు ఎదురైనా వెనకడుగు వేయకుండా పల్లె ప్రగతి కోసం అహర్నిశలు శ్రమించిన సర్పంచ్‌ల పదవీ కాలం గురువారం ముగిసిన నేపథ్యంలో భీమిలి నియోజకవర్గం లో గల మూడు మండలాల సర్పంచ్ లకు భీమిలి నియోజకవర్గం వైసిపి పార్టీ మహిళా అద్యుక్షురాలు డబ్బీరు ప్రశాంతి పట్నాయక్ అబినందనలు తెలిపారు. , సేవయే మార్గంగా గ్రామ సర్పంచ్ అంటే కేవలం ఒక పదవి కాదు, అదొక బాధ్యత అని గత ఐదేళ్ల కాలంలో కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు, ప్రాణాలకు తెగించి ప్రజల పక్షాన నిలబడిన ధీశాలురు మన సర్పంచ్‌లు అని కొనియాడారు. మురికి కాలువల మరమ్మతుల నుండి, వీధి దీపాల వెలుగుల వరకు.. ప్రతి సమస్యలోనూ 'మేమున్నాం' అంటూ ముందుండి నడిపారని,పచ్చని చెట్లు, స్వచ్ఛమైన పరిసరాలతో గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దడం లో ప్రజల మనిషులు గా రాజకీయాలకు అతీతంగా, పేదవాడి కష్టంలో పాలు పంచుకుంటూ గ్రామాల్లో సంక్షేమ వారధులు గా ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి గడపకూ చేరవేసేలా చిత్తశుద్ధితో సర్పంచ్ లు పనిచేశారని కొనియాడారు. పదవీ కాలం ముగిసినా, మీ సేవలు గ్రామ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. గ్రామాల అభివృద్ధికి మీరు వేసిన పునాదులు రేపటి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తాయని,'సేవా తత్పరత తో గ్రామ వికాసానికి కృషి చేసిన మీ సేవలుఎంతో విలువైనవని కొనియాడారు.

## దుస్సాహసానికి పాల్పడితే తీవ్ర పరిణామాలు



తిరువనంతపురం, ఏప్రిల్ 2: మధ్యప్రాచ్యంలోని అశాంతిని అవకాశంగా తీసుకుని పాకిస్థాన్ అలజడి సృష్టించడానికి ప్రయత్నిస్తే, భారతదేశం ప్రతిస్పందన 'నిర్ణయా త్మకంగా' ఉంటుందని రక్షణ శాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఇరాన్ యుద్ధం నీడలో ఎలాంటి 'దుస్సాహసానికి' పాల్పడవద్దని గురువారం హెచ్చరించారు. 2025 పహల్గామ్ దాడి, ఆపరేషన్ సింధూర్ మొదటి వార్షికోత్సవానికి కొన్ని రోజుల ముందు ఈ హెచ్చరిక చేశారుఎన్నికలు జరగనున్న కేరళలో గురువారం జరిగిన సైనిక్ సమ్మాన్ సమ్మేళనంలో మాట్లాడుతూ, మధ్యప్రాచ్యంలోని అ శాంతిని అవకాశంగా తీసుకుని పాకిస్థాన్ అలజడి సృష్టించ డానికి ప్రయత్నిస్తే, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని, ఇంకా ఆపరేషన్ సింధూర్ ముగియలేదని గుర్తించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఆపరేషన్ సింధూర్ సమయంలో భారత బలగాలు కేవలం 22 నిమిషాల్లోనే పాకిస్థాన్‌ను ఎలా మోకరింపజేశాయో రాజ్‌నాథ్‌సింగ్ గుర్తు చేశారు.

## గ్రంథాలయశాస్త్ర శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం -డాక్టర్ రావి శారద



ప్రజాస్వామ్యం, విజయవాడ

ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ సంచాలకుల వారి ఉత్తర్వుల మేరకు 2026 జూన్ నుండి గ్రంథాలయ శాస్త్రంలో సర్టిఫికేట్ కోర్స్ తరగతులు నిర్వహిస్తున్నట్లు విజయవాడ లోని పాతూరి నాగభూషణం గ్రంథాలయ శిక్షణాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ రావి శారద ఒక ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాలు నిండి, ఇంటర్ లో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేయుటకు అర్హులు. శిక్షణ కాలం 5 మాసాలు. పాఠాలు తెలుగు, ఇంగ్లీష్ మీడియంలలో బోధిస్తారని, ప్రభుత్వం వారి రిజర్వేషన్లను పాటిస్తూ ఇంటర్ లో వచ్చిన మార్కుల ప్రాతిపదికగా అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. ఇది రెగ్యులర్ కోర్సు అని, ప్రతిరోజూ విజయవాడలో తరగతులకు హాజరు కావాల్సి ఉంటుందని, శిక్షణానంతరం ప్రభుత్వం వారు పరీక్షలు నిర్వహించి అభ్యర్థులకు సర్టిఫికెట్లు ఇవ్వగలరని ఆమె తెలిపారు. దరఖాస్తులు,ఇతర వివరాలు కొరకు మాఫోన్ నం. 7995313148 లేదా 9290670671 కు సంప్రదించాలని పూరించిన దరఖాస్తులు ఏప్రిల్ 29 వ లోపు తమకు చేరాలని ఆమె తెలిపారు.

## సీతం కళాశాలలో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం




విజయనగరం: (ప్రజాస్వామ్యం)

స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో పాలిసెట్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మద్దతుగా ఒక ముఖ్యమైన చొరవగా, విజయనగరంలోని సీతం కళాశాలలో ఉచిత పాలిసెట్ కోచింగ్‌ను ప్రారంభిస్తున్నట్లు డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి ఒక ప్రకటనలో తెలియజేశారు .ఈ సందర్భంగా పాలీసెట్ ఉచిత శిక్షణ గోడ పత్రికను విడుదల చేస్తూ,ఏప్రిల్ 4, 2026 నుండి ఏప్రిల్ 24, 2026 వరకు నిర్వహించబడును.ఈ సందర్భంగా డాక్టర్ ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ, ఇటీవల 10వ తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఈ కోచింగ్ ప్రయోజనకరంగా ఉంటుందని నొక్కి వక్కాణించారు . ఉచిత కోచింగ్, స్టడీ మెటీరియల్స్, బాలురు మరియు బాలికలకు హాస్టల్ సౌకర్యాలు కల్పించే ఈ అవకాశాన్ని విద్యార్థులు, తల్లిదండ్రులు పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేశారు .ప్రతిరోజూ ప్రాక్టీస్ టెస్టుల ద్వారా నాణ్యమైన సన్నద్ధతను అందించేలా ఈ కార్యక్రమం రూపొందించబడింది. ఇది విద్యార్థులు పాలిసెట్ పరీక్ష కోసం తమ పనితీరును, ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపరుచుకోవడానికి వీలు కల్పిస్తుంది. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందం ద్వారా కోచింగ్ అందించబడుతుంది, ఇది విద్యార్థులకు బలమైన విద్యా పునాదిని అందిస్తుంది.ఈ శిక్షణ పొందుటకు పేరు నమోదుకు ఈ క్రింద తెలిపిన సెల్ నెంబర్ కి సంప్రదించవలెను అని సీతం కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.వి.రామమూర్తి గారు తెలియజేశారు.

## మహిళా పోలీస్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ల క్యాంటీన్ ప్రారంభం




భీమునిపట్నం, ప్రజాస్వామ్యం విశాఖ నగరంలోని మహిళా పోలీస్ స్టేషన్ ఆవరణలో నీతోడు సొసైటీ సహకారంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌జెండర్ల క్యాంటీన్‌ను నగర పోలీస్ కమిషనర్ డా.శంఖబ్రత బాగ్చీ గురువారం ప్రారంభించారు. రాష్ట్రంలోనే తొలిసారిగా ట్రాన్స్‌జెండర్ల నిర్వహణలో ఈక్యాంటీన్‌ను ఏర్పాటు చేయడం విశేషంగా చెప్పవచ్చు. కార్యక్రమంలో నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ ఎస్. అప్పలరాజు, మహిళా పోలీస్ స్టేషన్ ఏసీపీ అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**--- గజపతినగరం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రలో మంత్రి - కొండపల్లి శ్రీనివాస్**

**---వీధులు ఊడ్చి.. కలుపు మొక్కలు తీసిన మంత్రి - కొండపల్లి శ్రీనివాస్**



ప్రజాస్వామ్యం / గజపతినగరం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం ఉదయం ఆయన నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి గ్రామస్తులతో కలిసి తానొక పారిశుధ్య కార్మికుడిగా మారిపోయారు. పారిశుధ్యం - పరిశుభ్రతపై కేవలం సూచనలు చేయకుండా తాను స్వయంగా చీపురు పట్టుకుని గ్రామస్తులు, అధికారులతో కలిసి వీధులు ఊడ్చి శుభ్రం చేశారు. కత్తి చేత పట్టుకుని అక్కడ పేరుకుపోయిన కలుపు మొక్కలు స్వయంగా తొలగించారు. తాను పని చేయడంతో పాటు గ్రామంలో ప్రతి ఒక్కరిని ఉత్సాహపరుస్తూ వారు కూడా పారిశుధ్య పనుల్లో పాల్గొనేలా చేశారు. వీధులు శుభ్రం చేయడంతో పాటు పిచ్చి మొక్కలు తొలగించి ఆ ప్రాంతం అంతా శుభ్రం చేసే వరకు మంత్రి అక్కడ నుంచి కదల్లేదు. పారిశుధ్య కార్మికులతో డ్రైనేజ్ పూడిక తీయించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రం, మేజర్ పంచాయతీ గజపతినగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిమీద ఉందని తెలిపారు. పరిశుభ్రత పట్ల ప్రజల్లో ఇంకా చైతన్యం రావాల్సిన అవసరం ఉందని మంత్రి గుర్తుచేశారు. పరిశుభ్రతకు ప్రభుత్వ పరంగా మేం ఎన్ని పనులు చేసినా.. ఇవన్నీ మీ పరిసరాలు.. మీరు ఇక్కడే ఉంటారు.. మీ పిల్లలు ఇక్కడే ఉంటారు.. మీరే ఎక్కువ బాధ్యత తీసుకోవాలని గ్రామస్తులను ఉద్దేశించి మంత్రి తెలిపారు. పరిశుభ్రత ప్రజల బాధ్యత అని... చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదని సూచించారు. ఓ వైపు పరిశుభ్రం చేసిన స్థలంలోనే వాటర్ బాటిల్స్ వేశారని.. ఇలా బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే పారిశుధ్య కార్యక్రమాల వల్ల ప్రయోజనం ఉండదని మంత్రి అసహనం వ్యక్తం చేశారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో పరిశుభ్రత ఒక ప్రధానాంశమని, ఇందుకోసం ప్రతి గ్రామంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని మంత్రి ఆకాంక్షించారు. మంత్రి కొండపల్లి స్వయంగా చేపట్టిన ఈ పారిశుధ్య స్ఫూర్తి కార్యక్రమం గజపతినగరం వాసుల్లో కొత్త ఉత్తేజాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గోపాలరాజు, గజపతినగరం మండల టీడీపీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవు

**----సచివాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్- ఎస్.రాంసుందర్ రెడ్డి**



ప్రజాస్వామ్యం / గజపతినగరం :

జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి గురువారం గజపతినగరం రెండో నంబర్ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది హాజరు తీరును పరిశీలించిన కలెక్టర్, విధులకు ఆలస్యంగా వచ్చిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయ పాలన పాటించని సిబ్బందికి వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీఓను ఆదేశించారుఅనంతరం సచివాలయ ప్రాంగణాన్ని పరిశీలించి, పరిశుభ్రత పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ పరిసరాలను అద్దంలా ఉంచాలని, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు సకాలంలో అందాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

## వెంకటాపురంలో రక్తదాన శిబిరం

**ఫౌండేషన్ కార్యదర్శి - రేవంత్**



ప్రజాస్వామ్యం / గజపతినగరం : మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామంలో శనివారం నాడు సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి రేవంత్ గురువారం విలేకరులకు తెలియజేశారు. ఫౌండేషన్ సభ్యుడు ఇడిదల ఆషిక్ తల్లి జ్ఞాపకార్థం ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు రేవంత్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ కార్యదర్శి రేవంత్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం అలవాటు చేసుకోవాలని, రక్తదానం చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు . రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడమేనని రేవంత్ అన్నారు. రక్తదాన శిబిరంలో రక్తదాతలు ముఖ్యంగా యువత అధిక సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని సాయి రేవంత్ విజ్ఞప్తి చేశారు.

## అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**ఎస్.రామ సుందర్ రెడ్డి --- విధులకు గైర్హాజరైన కార్యకర్తపై ఆగ్రహం. ---- చిన్నారులతో మమేకమై వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.**



ప్రజాస్వామ్యం గజపతినగరం:జిల్లా కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి గురువారం గజపతినగరం మండలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పర్యటనలో భాగంగా పురిటిపెంట-1 అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్, అక్కడ విధుల్లో ఉండాల్సిన అంగన్వాడీ కార్యకర్త గైర్హాజరు కావడాన్ని గుర్తించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారుచిన్నారుల సంరక్షణ, పౌష్టికాహార పంపిణీలో ఇలాంటి నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు.ఈ ఘటనపై తక్షణమే స్పందించి, బాధ్యులైన సి.డి.పి.ఓ, సూపర్వైజర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఐ.సి.డి.ఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌ను ఆదేశించారు. కేంద్రాల నిర్వహణలో పర్యవేక్షణ లోపంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. చిన్నారులతో మమేకమై వారి యోగ క్షేమాలను విచారించారు.



## రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలి

**అనవసర ఆలస్యానికి తావుండరాదు**

**పార్వతీపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీలో జేసీ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి వెల్లడి**



ప్రజాస్వామ్యం/పార్వతీపురం, ఏప్రిల్ 2 : రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, అనవసరమైన జాప్యానికి తావివ్వరాదని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గురువారం పార్వతీపురం పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జేసీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించి, రికార్డుల నిర్వహణపై సిబ్బందిని ఆరా తీశారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇండెక్స్ రిజిస్టర్లు మరియు పెండింగ్‌లో ఉన్న దస్తావేజులను ఆయన నిశితంగా పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్టర్ కార్యాలయానికి విచ్చేసిన క్రయ, విక్రయదారులతో ముచ్చటించి, ప్రభుత్వం అందిస్తున్న సేవల సంతృప్తిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జేసీ మాట్లాడుతూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత పాటించాలని, అనవసర ఆలస్యానికి తావుండకూడదని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి రావాల్సిన స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ ఫీజుల వసూళ్లపై సమీక్షించారు. లక్ష్యాలను సకాలంలో చేరుకోవాలని సూచించారు. వేసవి దృష్ట్యా కార్యాలయ ప్రాంగణంలో తాగునీరు, నీడ వంటి కనీస వసతులపై అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ తనిఖీలో సబ్ రిజిస్ట్రార్‌తో పాటు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పేదరిక నివారణలో దివిస్ కృషికి పి4 మార్గదర్శిలో ప్రథమ స్థానం అవార్డు




భీమునిపట్నం, ప్రజాస్వామ్యం: రాష్ట్రంలో పేదరిక నివారణకు సి ఎం చంద్రబాబు నాయుడు చేపట్టిన పథకం క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలు ఇవ్వడమే గాక పలు సంస్థలు చేసిన కృషికి జిల్లా స్థాయిలో అవార్డులు అందించారు. స్వర్ణాంధ్ర 2047 లో భాగంగా పి4 ఫౌండేషన్ ఏర్పాటు చేసి సంవత్సరం పూర్తి చేసుకున్నందున మొదటి సంవత్సర విజయోత్సవ వేడుకను విశాఖపట్నం కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించారు. విశాఖపట్నం జిల్లాలో పేదరిక నివారణకు కృషి చేసిన సంస్థలలో దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ చిప్పాడ కంపెనీ మార్గదర్శి గా ప్రథమ స్థానంలో చోటు దక్కించుకుంది. ఈ సందర్భంగా దివిస్ యాజమాన్యానికి జిల్లా కలెక్టర్ హరేంద్ర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు సమక్షంలో జిల్లా ఇంచార్జ్ మంత్రి బాల వీరాంజనేయ స్వామి ప్రశంసా పత్రం మరియు జ్ఞాపికను వైయస్ కోటేశ్వరావు కు అందించారు. ఈ సమావేశంలో దివిస్ సంస్థ ద్వారా లబ్ధి పొందిన కుటుంబాల అభిప్రాయాలు స్వయంగా తెలుసుకొని యాజమాన్యాన్ని అభినందించారు. ఈ సందర్భంగా దివిస్ మేనేజింగ్ డైరెక్టర్ దివి మురళీకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. దివిస్ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ దివిస్ ఆధ్వర్యంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి, వివిధ ఆసుపత్రులలో మౌలిక వసతుల కల్పనకు, గ్రామ స్థాయిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు, మహిళల కొరకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమం తదితర అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని చెప్పారు. ఈ సమావేశానికి ప్రభుత్వ పెద్దలు అధికారులు వివిధ సంస్థల ప్రతినిధులు, మార్గదర్శకులు, బంగారు కుటుంబాలు, దివిస్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# హెబ్బా అందాల దాడి.

"కుమారి 21ఎఫ్" సినిమాతో కుర్రాళ్ల గుండెల్లో గంటలు కొట్టించిన హెబ్బా పటేల్, ఇప్పుడు సోషల్ మీడియాలో మరోసారి సెగలు పుట్టిస్తోంది. సినిమాల్లో గ్లామర్ పాత్రలతో మెప్పించిన ఈ భామ, తాజాగా పోస్ట్ చేసిన ఫోటోషూట్ నెట్టింట వైరల్ అవుతోంది. తన బోల్డ్ లుక్స్ మరియు ట్రెండీ ఫ్యాషన్ స్టైల్‌తో అభిమానులను ఫిదా చేస్తూ, సమ్మర్ హీట్‌ను మరింత పెంచేస్తోంది. ఈ ఇస్మార్ట్ బ్యూటీ లేటెస్ట్ ఫోటోల వెనుక ఉన్న అసలు సంగతేంటో ఇప్పుడు చూద్దాం.సమ్మర్ హీట్ పెంచేస్తున్న హెబ్బా పటేల్:హెబ్బా పటేల్ తాజాగా "దీశీతీఎవతీశ్రీఱఅవ తీఱఅఎశీఎ" అంటూ తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫోటోలను షేర్ చేసింది. ఇందులో ఆమె వేసుకున్న షార్ట్ అండ్ స్టైలిష్ సమ్మర్ డ్రెస్ నెటిజన్ల దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తోంది. ముఖ్యంగా ఆమె బోల్డ్ అండ్ కాన్ఫిడెంట్ లుక్ చూసి ఫ్యాన్స్ ముగ్ధులవుతున్నారు. "సూపర్ హాట్ బ్యూటీ", "సమ్మర్ కంటే నీవే ఎక్కువ హాట్‌గా ఉన్నావు" అంటూ నెటిజన్లు కామెంట్లతో సోషల్ మీడియాను హోరెత్తిస్తున్నారు. ఆమె గ్లామర్ అటాక్ ఇప్పుడు టాలీవుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారిందికుమారి 21ఎఫ్ నుంచి నేటి వరకు.. ప్రయాణం:మొదటి సినిమా "కుమారి 21ఎఫ్"తోనే యూత్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న హెబ్బా, తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. కేవలం హీరోయిన్ పాత్రలకే పరిమితం కాకుండా, కథలో ప్రాధాన్యత ఉన్న సపోర్టింగ్ రోల్స్ చేయడానికి కూడా ఆమె వెనుకాడలేదు. గ్లామర్ ఒలకబోయడంలో తనకంటూ ఒక మార్క్ సెట్ చేసిన హెబ్బా, తెలుగులో 'ఈడో రకం ఆడో రకం', 'అంధగాడు' వంటి సినిమాలతో ప్రేక్షకులను అలరించింది. గత ఏడాది ఈషా మూవీ తో ప్రేక్షకుల ను ప్రేక్షకులను పలకరించింది. ఇక ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తనదైన స్టైల్‌లో కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోందిసోషల్ మీడియా క్వీన్‌గా హెబ్బా సందడి:సినిమాలతో ఎంత బిజీగా ఉన్నా, హెబ్బా సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తన రెగ్యులర్ అప్డేట్స్, వెకేషన్ ఫోటోలు మరియు గ్లామరస్ ఫోటోషూట్‌లను ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌తో పంచుకుంటూ ఉంటుంది. అందుకే ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలోయింగ్ కూడా భారీగానే ఉంది. తాజాగా చేసిన ఈ బోల్డ్ ఫోటోషూట్ ఆమె ఫ్యాషన్ సెన్స్‌ను మరోసారి నిరూపించింది. ట్రెండీ అవుట్‌ఫిట్‌లను క్యారీ చేయడంలో తనకు సాటి ఎవరూ లేరని ఈ చిన్నది మరోసారి ప్రూవ్ చేసుకుందివైవిధ్యమైన పాత్రలతో బిజీ బిజీ:ప్రస్తుతం హెబ్బా పటేల్ కేవలం సినిమాలకే కాకుండా వెబ్ సిరీస్‌లపై కూడా దృష్టి పెడుతోంది. నటనకు స్కోప్ ఉన్న పాత్రలను ఎంచుకుంటూనే, అప్పుడప్పుడు స్పెషల్ సాంగ్స్‌లో మెరుస్తూ తన గ్లామర్ పవర్‌ను చూపిస్తోంది. కెరీర్ ఆరంభంలో వచ్చినంత సక్సెస్ ఇప్పుడు లేకపోయినప్పటికీ, తన క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని తాజాగా వైరల్ అవుతున్న ఫోటోలే సాక్ష్యం. భవిష్యత్తులో మరిన్ని విభిన్నమైన ప్రాజెక్టులతో తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు హెబ్బా సిద్ధమవుతోందిగ్లామర్ తో గెలుస్తున్న కుమారి:హెబ్బా పటేల్ తన బోల్డ్ లుక్స్‌తో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండటం కొత్తేమీ కాదు. కానీ ఈ సమ్మర్ లో ఆమె ఇస్తున్న స్టిల్స్ మాత్రం నెక్స్ట్ లెవల్‌లో ఉన్నాయి. తన అందచందాలతో సోషల్ మీడియాను షేక్ చేస్తున్న ఈ కుమారి రాబోయే సినిమాలతో బాక్సాఫీస్ వద్ద కూడా ఇలాగే అదరగొట్టాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఇక ఏది ఏమైనా, తన గ్లామర్ దాడితో హెబ్బా మరోసారి ఇంటర్నెట్ సెన్సేషన్ అయిపోయింది.



## జై శ్రీరామ్: 92 ఏళ్ల క్రితం

# ముత్తాత.. ఇప్పుడు మునిమనవడు!

భారతీయ సినిమా చరిత్రలో కపూర్ ఖాందాన్ కు ఉన్న ప్రత్యేకత గురించి అందరికీ తెలిసిందే. అయితే ఇప్పుడు రణబీర్ కపూర్ -రామాయణం- చిత్రంలో శ్రీరాముడి పాత్ర పోషిస్తుండటంతో ఒక అరుదైన, చారిత్రాత్మక అనుబంధం వెలుగులోకి వచ్చింది. సరిగ్గా 92 ఏళ్ల క్రితం రణబీర్ ముత్తాత, లెజెండరీ నటుడు పృథ్వీరాజ్ కపూర్ కూడా వెండితెరపై శ్రీరాముడి పాత్రలో మెరిశారు. ఇంతకాలానికి కపూర్ కుటుంబంలో మూడో తరం కుర్రాడు శ్రీరాముడిగా నటించడం యాదృచ్ఛికం. ఒకే కుటుంబానికి చెందిన రెండు తరాల నటులు దశాబ్దాల వ్యవధిలో ఒకే పవిత్రమైన పాత్రను పోషించడం భారతీయ సినిమా చరిత్రలో ఒక అరుదైన రికార్డుగా నిలిచిపోనుంది1934లో విడుదలైన -సీతా- అనే హిందీ చిత్రంలో పృథ్వీరాజ్ కపూర్ శ్రీరాముడిగా కనిపించారు. ఆ కాలపు ప్రసిద్ధ దర్శకుడు దేవకీ బోస్ తెరకెక్కించిన ఈ చిత్రంలో సీతమ్మ తల్లి పాత్రను ప్రముఖ నటి దుర్గా ఖోటే పోషించారు. భారతీయ సినిమా పునాదులు పడుతున్న ఆ రోజుల్లోనే ఈ చిత్రం అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందింది. వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో గౌరవ డిప్లొమా పొందిన మొదటి భారతీయ టాకీ చిత్రంగా -సీతా- సరికొత్త చరిత్ర సృష్టించింది. ఆనాడు పృథ్వీరాజ్ కపూర్ పోషించిన ఆ పాత్ర అప్పట్లో ఒక పెద్ద సంచలననాటి బ్లాక్ అండ్ వైట్ యుగంలో పృథ్వీరాజ్ కపూర్ తన 20వ ఏటనే రాముడి పాత్రను అత్యంత గంభీరంగా పోషించారు. ఇప్పుడు రణబీర్ కపూర్ తన 40 ఏళ్ల వయస్సులో అత్యున్నత విజువల్ ఎఫెక్ట్స్ (వీఎఫ్ఎక్స్) ..ఆధునిక సాంకేతికతతో అదే పాత్రను మళ్ళీ వెండితెరపైకి తీసుకువస్తున్నారు. ముత్తాత కాలంలో ఉన్న నిరాడంబరత, నేటి తరం మేకింగ్ హంగులు కలిసినా.. రాముడి పాత్రలో ఉండాల్సిన ఆ ప్రశాంతత- దైవత్వం రణబీర్‌లోనూ కనిపిస్తోందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారుప్రస్తుతం సోషల్ మీడియాలో పృథ్వీరాజ్ కపూర్ రాముడి గెటప్‌లో ఉన్న ఫోటోలును.. రణబీర్ తాజా టీజర్ ఫోటోలతో పోలుస్తూ అభిమానులు వైరల్ చేస్తున్నారు. కపూర్ కుటుంబం తరతరాలుగా భారతీయ పౌరాణిక, చారిత్రాత్మక పాత్రలకు ప్రాణం పోస్తోందని ఈ ఉదాహరణ మరోసారి నిరూపిస్తోంది. ముత్తాత పృథ్వీరాజ్ కపూర్ లాగే రణబీర్ కూడా ఈ పాత్ర కోసం అత్యంత ఉత్తముడిగా మారి క్రమశిక్షణను పాటిస్తూ.. తన ముత్తాత వారసత్వాన్ని సగర్వంగా ముందుకు తీసుకెళ్తున్నారు. రణ్ బీర్ కపూర్ తన పాత్ర కోసం మద్యం, మాంసం మానేసాడంటే అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు అతడు పూర్తి ఆధ్యాత్మికతతో ఉన్నాడుఇన్ని ఏళ్ల తర్వాత మళ్ళీ కపూర్ కుటుంబం నుండే రాముడి పాత్రకు ఎంపిక జరగడం ఒక అపురూపమైన కాకతాళీయమైన విషయంగా ట్రేడ్ వర్గాలు, సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. 92 ఏళ్ల క్రితం నాటి ఆ సాంస్కృతిక వారసత్వాన్ని నేటి తరానికి అందించే బాధ్యతను రణబీర్ తన భుజాన వేసుకున్నారు. ఈ చారిత్రక అనుబంధం -రామాయణ- చిత్రంపై అంచనాలను మరింతగా పెంచడమే కాకుండా, కపూర్ కుటుంబ గౌరవాన్ని మరో స్థాయికి తీసుకెళుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ధురంధర్ తర్వాత రామాయణ.. మరి వారణాసి?

బాలీవుడ్ లో రెండు పార్టుల సినిమాల ట్రెండ్ మళ్లీ ఊపందుకుంటోంది. రీసెంట్ గా విడుదలైన ధురంధర్ సినిమా రెండు పార్టులుగా వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకుంది. ఆ మూవీ రెండు భాగాలు కూడా ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో పాటు కలెక్షన్ల పరంగా కూడా రికార్డులు సృష్టించాయి. దీంతో పెద్ద కథలను రెండు భాగాలుగా తెరకెక్కించే ట్రెండ్ మళ్లీ చర్చనీయాంశంగా మారింది.ఇక ఇప్పుడు అందరి దృష్టి బాలీవుడ్ లో తెరకెక్కుతున్న భారీ పౌరాణిక చిత్రం రామాయణపై పడింది. దర్శకుడు నితేశ్ తివారీ రూపొందిస్తున్న ఆ మూవీ ఇప్పటికే రెండు భాగాలుగా రానున్నట్లు మేకర్స్ ప్రకటించారు. మొదటి భాగాన్ని 2026 దీపావళికి, రెండో భాగాన్ని 2027 దీపావళికి విడుదల చేయాలని ప్లాన్ చేశారు. ఇటీవల విడుదలైన గ్లింప్స్ ద్వారా ఆ విషయాన్ని మరోసారి స్పష్టం చేశారు.భారీ బడ్జెట్, అద్భుతమైన విజువల్స్ తో ఆ చిత్రం తెరకెక్కుతున్న నేపథ్యంలో, రెండు భాగాలుగా విడుదల చేయడం సరైన నిర్ణయమని అంతా అభిప్రాయపడుతున్నారు. అదే సమయంలో మరో ఆసక్తికరమైన చర్చ మొదలైంది. అదే వారణాసి సినిమా గురించి. టైమ్ ట్రావెల్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఆ ప్రాజెక్ట్ పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి.ముఖ్యంగా ఇందులో రామాయణానికి సంబంధించిన ఎపిసోడ్ కూడా ఉండటం ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆ సినిమాను కూడా రెండు భాగాలుగా విడుదల చేస్తారా లేదా అనేది ఇంకా క్లారిటీ లేదు. తెలుగు సినీ పరిశ్రమలో సీక్వెల్ ట్రెండ్ ను పాపులర్ చేసిన వ్యక్తి రాజమౌళి. ఆయన తెరకెక్కించిన బాహుబలి సినిమాను రెండు భాగాలుగా విడుదల చేసి సంచలనం సృష్టించారుఆ తర్వాత నుంచి పెద్ద కథలు రెండు పార్టులుగా చెప్పే ధోరణి బలపడింది. అయితే రాజమౌళి తన ప్రతి సినిమాను రెండు భాగాలుగా తీస్తారని మాత్రం కాదు. ఉదాహరణకు ఆయన తీసిన ఆర్ఆర్ఆర్ ఒకే భాగంగా విడుదలై ప్రపంచవ్యాప్తంగా ఘన విజయం సాధించింది. వారణాసి సినిమాపై కూడా ఇదే ప్రశ్న ఎదురవుతుంది. ఆ మూవీని రెండు పార్టులుగా తెరకెక్కించే ఆలోచన ఉందా లేదా అనే దానిపై ఇప్పటివరకు స్పష్టత లేదుగతంలో రాజమౌళి ఆ ప్రాజెక్ట్ ను రెండు భాగాలుగా తీసే ఆలోచన లేదని సంకేతాలు ఇచ్చినట్లు వార్తలు వచ్చాయి. అయితే కథ, విజువల్ స్కేల్ ను బట్టి ఫైనల్ గా ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. మొత్తానికి, ధురంధర్ విజయంతో ప్రారంభమైన ఆ చర్చ రామాయణతో మరింత బలపడింది. ఇప్పుడు అందరి చూపు వారణాసిపై ఉంది. అది కూడా రెండు భాగాలుగా వస్తుందా? లేక ఒకే భాగంగా ప్రేక్షకుల ముందుకు వస్తుందా? అన్నది తెలుసుకోవాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.



## నభా నటేష్ అందాల తుఫాన్..

# ఈసారి హాట్‌నెస్ పీక్‌లో!

తెలుగు తెరపై తనదైన ముద్ర వేసిన అందాల భామ నభా నటేష్, తాజాగా సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తోంది.తెలుగు తెరపై తనదైన ముద్ర వేసిన అందాల భామ నభా నటేష్, తాజాగా సోషల్ మీడియాలో సెగలు పుట్టిస్తోంది. బ్లాక్ కలర్ శారీలో తన హాట్ అందాలను ఆరబోస్తూ ఆమె ఇచ్చిన స్టిల్స్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. కొన్ని రోజుల తర్వాత రీ-ఎంట్రీ ఇచ్చిన ఈ 'ఇస్మార్ట్' పిల్లా, వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉండటమే కాకుండా.. గ్లామర్ డోస్ పెంచి అభిమానుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. అసలు ఆ ఫోటోల విశేషాలేంటో చూద్దాం.బ్లాక్ శారీలో నభా మెరుపులు.. వైరల్ అవుతున్న ఫోటోలు:నభా నటేష్ అంటేనే ఒక ఎనర్జీ. సినిమాల్లోనే కాదు, సోషల్ మీడియాలో కూడా ఆమె చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ బ్లాక్ కలర్ శారీలో అదిరిపోయే ఫోటోషూట్ చేసింది. తన నడుము ఒంపులు, ఎద అందాలు హైలెట్ అయ్యేలా ఆమె ఇచ్చిన బోల్డ్ స్టిల్స్ చూసి నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. "బ్లాక్ బ్యూటీ అంటే నీవే నభా" అంటూ కామెంట్స్ సెక్షన్‌ను నింపేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి.నన్ను దోచుకుందువటే నుండి ఇస్మార్ట్ శంకర్ వరకు:కన్నడ సోయగం అయిన నభా, 2018లో 'నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. ఆ సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోయినా, పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' ఆమె దశను మార్చేసింది. ఆ సినిమాలో తెలంగాణ యాసలో మాట్లాడుతూ, మాస్ లుక్‌లో నభా చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ఇక ఆ ఒక్క సినిమాతో ఓవర్‌నైట్ స్టార్ అయిపోయిన ఈ బ్యూటీ, వరుసగా క్రేజీ ఆఫర్లను దక్కించుకుని తెలుగు ప్రేక్షకుల ఫేవరెట్ హీరోయిన్‌గా మారిపోయింది.ప్రమాదం నుంచి కోలుకుని.. అదిరిపోయే రీ-ఎంట్రీకెరీర్ ఫుల్ స్వింగ్‌లో ఉన్న సమయంలోనే నభాకు ఒక చిన్న యాక్సిడెంట్ జరిగింది. దీనివల్ల ఆమె కొంతకాలం పాటు సినిమాలకు బ్రేక్ ఇచ్చి బెడ్ రెస్ట్ తీసుకోవాల్సి వచ్చింది. ఆ గ్యాప్ తర్వాత మళ్ళీ ఫుల్ ఎనర్జీతో రీ-ఎంట్రీ ఇచ్చింది. ఇక ఇటీవల ప్రియదర్శి సరసన 'డార్లింగ్' చిత్రంతో పలకరించినప్పటికీ, ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద నిలబడలేకపోయింది. అయినప్పటికీ నభా క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ప్రస్తుతం ఆమె చేతిలో మూడు భారీ ప్రాజెక్టులు ఉండటం విశేషంస్వయంభు, నాగబంధంతో మళ్ళీ ఫామ్‌లోకి:ప్రస్తుతం నభా నటేష్ 'స్వయంభు', 'నాగబంధం' మరియు 'ట్రైసన్ నాయుడు' వంటి విభిన్నమైన చిత్రాల్లో నటిస్తోంది. ఈ సినిమాలు ఆమె కెరీర్‌కు చాలా కీలకం కానున్నాయి. ముఖ్యంగా పీరియాడిక్ డ్రామాగా వస్తున్న స్వయంభుపై భారీ అంచనాలు ఉన్నాయి.ఇక ఈ సినిమాల్లో కనీసం రెండు హిట్టయినా నభా రేంజ్ మళ్ళీ టాప్ ప్లేస్‌కు వెళ్లడం ఖాయం. అటు గ్లామర్ పరంగా, ఇటు నటన పరంగా తనను తాను నిరూపించుకోవడానికి నభా గట్టిగానే ప్రయత్నిస్తోందిముగింపు: ఇస్మార్ట్ పిల్లా ఈజ్ బ్యాక్:యాక్సిడెంట్ వంటి కష్టాలను దాటుకుని



EDITED PRINTED, PUBLISHED AND OWNED BY M. SIVAKUMAR, PRAJA SWAMYAM TELUGU DAILY, PLOT NO 138 PAVANI NAGAR, CANTONMENT, VIZIANAGARAM-535003. (AP) PRINTED AT JAYAM GRAPHICS, OFF-SETPRINTERS, PLOT NO. 138, PAVANI NAGAR, CANTONMENT. VIZIANAGARAM 535003, (AP)
Cell 97032 07611, E-mail pldnewsvzm@gmail.com. RNI No. APTEL/2008/24928 Poster Regd. No. VZM/22/2020-2022